# ఆలోచన అదిరింది!

సాధారణంగా విద్యా సంస్థలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, మాల్స్‌లో ఉద్యోగులు లేదా విద్యార్థుల హాజరు వేయాలంటే హాజరుపట్టీలో వేస్తారు. ఇది ఎప్పటి నుంచో వస్తున్న పద్ధతి. కొన్నిచోట్ల బయోమెట్రిక్ విధానం ద్వారా ఉద్యోగుల హాజరు వేస్తున్నారు. తాజాగా మొబైల్స్ వినియోగం పెరగడంతో అందుకు అనుగుణంగా హాజరును నమోదు చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన ఓ విద్యార్థినికి వచ్చింది. అనుకున్నదే తడవుగా ఇందుకోసం కసరత్తు చేసింది. ఈ క్రమంలో తన ఆలోచనను ఉపయోగించి మొబైల్‌లో యాప్‌ను రూపొందించింది బీటెక్ విద్యార్థిని దివ్య. ఆ విశేషాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, కానూరు

✦ హాజరు నమోదుకు మొబైల్ యాప్ రూపకల్పన

✦ ఇంజినీరింగ్ విద్యార్థిని సృజన

తేలప్రోలు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్స్ సైన్స్ చివరి సంవత్సరం చదువుతున్న కె.దివ్య.. తనకొచ్చిన ఓ వినూత్న ఆలోచనతో ఉద్యోగులు, సిబ్బంది హాజరు నమోదు చేయడానికి మొబైల్ యాప్‌ను రూపొందించింది.



## ఎలా పనిచేస్తుందంటే?

ఆండ్రాయిడ్ మొబైల్స్, వైఫై కనెక్షన్, ఎంఏసీ అడ్రస్‌లను ఆండ్రాయిడ్ స్టూడియో సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి యాప్‌ను తయారు చేసింది. దీనికి ఏ-3గా నామకరణం చేసింది. అథెంటిక్ అటెండెన్స్ యాప్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను మొబైల్‌లోకి నిక్షిప్తం చేసుకోవాలి. వీరందరిని వైఫై కనెక్షన్ ఉన్న గదిలో ఉంచాలి. అక్కడ ఎంఏసీ అడ్రస్ ద్వారా హాజరు వేస్తుంది. ఈ మూడింటి సాయంతో విద్యార్థి హాజరును(యాప్‌ను వాడుతున్న వారి హాజరును) అథెంటిక్‌గా ఎక్సెల్ షీటులోకి రూపాంతరం చేస్తుంది. ఇలాచేయటం వల్ల సమయం, శ్రమ వృథా కాదు. ప్రతి పీరియడ్‌కు హాజరు వేయవచ్చు. లేదా ఎంతసమయం అతడు కార్యాలయంలో ఉన్నాడో లేదో అన్న విషయంపై మొత్తం సమాచార షీటు ద్వారా ఎప్పటి కప్పుడు అప్‌డేట్ చేస్తుంది. దీనివల్ల విద్యార్థి ఎంత సమయం తరగతిలో ఉన్నాడు? లేదా ఉద్యోగి ఎంతసమయం పనికి కేటాయించాడో అన్న విషయాలను కూడా విశ్లేషించే విధంగా రూపొందించారు.




ప్రాజెక్టు నమూనా

## పేటెంట్లు తీసుకుంటాం



తొలిసారిగా టెక్నాలజీని వినియోగించి ఈ యాప్‌ను రూపొందించా. మొబైల్‌లో యాప్ ఉంచటం ద్వారా, వైఫై ఉన్న గదిలో ఉండటం ద్వారా.. ఆటోమెటిక్‌గా హాజరువేసే ప్రక్రియను రూపొందించా. టెక్నాలజీని కళాశాల ఉషారామా రీసెర్చ్, డెవలప్‌మెంటు వారికి అందించా. ఇందుకు సాంకేతిక సహకారం కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, డైరెక్టర్ రాజశేఖరరావు అందించారు. ఈ యాప్‌కు పేటెంట్లు తీసుకుంటాం. **- దివ్య**